# శంకరనారాయణ వీధి

పి. యస్. రామజోగారావు

ఒకానొకప్పుడు ఆంధ్రదేశంలో శైవమతము వైష్ణవ మతము రెండూ బాగా వ్యాప్తిలో నుండేవి. ప్రజలు ఎవరిమట్టుకు వారు విధిగా ఏదో ఒక మతాన్ని అవలంబించే వారు. కాని వారి మధ్య మతసహనము మాట అలా ఉండగా మత విద్వేషాలే బాగా ప్రబలి ఉండేవి. పండితులు మొదలుకొని సామాన్యులవరకూ ప్రతివారూ, మత విషయ చర్చలలో తమ మతాన్ని పొగడుకోడంతో బాటు ఎదుటివారి మతాన్ని వారి దేవుళ్ళను దూషించడానికి ఏమాత్రం వెనుదీసేవారు కాదు.

ఒకసారి తిమ్మయ్య అనే ఒకాయన బహుకాలం ఉత్తరదేశంలో తీర్థయాత్రలు చేసుకున్న తర్వాత తన దేశానికి తిరిగి వస్తూన్నాడు. అతను ఒక ఊరు చేరేసరికి మధ్యాహ్నమైంది. కాని అక్కడికి తన ఊరు ఇంకాదూరంగా ఉండడం చేత ఏం చేద్దామా అని తటపటాయిస్తున్న తిమ్మయ్యకి హఠాత్తుగా, ఆ వూళ్లో తన బంధువు లున్నట్లు జ్ఞాపకం వచ్చింది. ఇంకేం, ఆ పూటకు చుట్టాలింటిలో విశ్రాంతి తీసుకుని మర్నాడు మళ్ళీ బయలుదేరవచ్చుని నిశ్చయించాడు తిమ్మయ్య.

తన బంధువులున్న వీధి పేరు శంకరనారాయణగారివీధి అని తెలుసునుగాని అసలా వీధి ఎక్కడుందో అతనికి తెలియదు. చాలాకాలం నుంచి తీర్థయాత్రలు చేస్తూ ఈ ప్రాంతాలకు దూరంగా ఉండడం వల్ల ఇక్కడ రేగుతున్న మతకషలు గురించి అతనికేమీ తెలీదు. అదీ కాక అతను సాధారణంగా మత వివాదాలజోలికి పోయేవాడుకాదు.

ఆ వీధిగురించి ఎవర్ని వాకబు చేయటమా అని ఆలోచిస్తూన్న తిమ్మయ్యకి, ఇంటిఅరుగుమీద ఆసీనుడైన ఒక ఆచార్యులవారు కనిపించాడు. అతనిపక్కన నిగనిగలాడుతూ పట్టెవర్థనాలు తీర్చిదిద్ది ఉన్న ఒక కలశం ఉంది. ముందు దాహమైనా తీర్చుకోవచ్చుకదాఅని తిమ్మయ్య అతని కెదురుగా పోయి



నమస్కరించాడు. ఆచారిగారుతిరిగి దండం పెడుతూ ఇలా అన్నాడు.

"ఇలా అరుగుమీద కూర్చోండి. మీది ఈ వూరు కానట్టుందే?"

"కాదు. ఇక్కడ మా బంధువులున్నారులెండి" అతని ఆదరానికి ఉబ్బిపోయిన తిమ్మయ్య మళ్ళీ ఇలా అన్నాడు.

"కొంచెం మంచినీళ్ళిప్పిస్తారా?"

"అలాగే" అంటూ ఆచార్యులు "మీ బంధువులు ఈ వూళ్ళో ఎక్కడున్నారు?" అని మళ్ళీ ప్రశ్నించాడు.

"శంకరనారాయణగారి వీధిలో ......" అని తిమ్మయ్య ఇంకా ఏదో అనబోతూంటే, ఆచార్యుల వారి ముఖకవళికలు ఇట్టే మారిపోయాయి. నీళ్లు పొయ్యడానికి ఎత్తిన కలశం అలాగే క్రిందికి జారవిడిచి "శ్రీరంగరంగ.........అపచారం" అంటూ లెంపలేసుకున్నాడు!

తిమ్మయ్య కి ఏం అర్థంకాక ఇంకా మంచినీళ్లకోసం ప్రాధేయపడబోయాడు. అతన్ని సగంలోనే ఆపి ఆచార్యులు "ఇంకా నీకు నీళ్లు కావాలీ, పవిత్ర నారాయణశబ్దం ముందు శంకర, కంకర అనడానికి సిగ్గులేక...ఫో అవతలికి" అని కసిరికొట్టాడు.

ఇది జరిగిన తర్వాత వీధిగురించి మరెవ్వరి నడగడానికీ తిమ్మయ్యకి ధైర్యం చాల్లేదు. ఎండెక్కుతూన్న కొలదీ అలిసి తిరుగుతూన్న అతనికి ఒక జంగం కనిపించాడు. అతని కా వీధి ఎక్కడుందో తెలియకపోదని తిమ్మయ్యకో ఆలోచన తట్టింది. వెంటనే అతనిదగ్గరకెళ్ళి, మంచి చేసుకోడానికి ఓకానీ అతనిసంచీలో వేసి తిమ్మయ్య ఇలా అడిగేడు.

"జంగమస్వామీ, మీరు శంకర..."

"అవును నాయనా. శివుడు నీలోనూ, నాలోనూ అందర్లోనూ ఉన్నాడు, శివోహం..."

"అది కాదయ్యా సాద, మీరు శంకరనారాయణగారి వీధి ఎక్కడుందో ఎరుగుధురా" అని వెళ్ళబోశాడు తిమ్మయ్య.

'నారాయణ' అని వినగానే జంగమయ్యకి ఒంటిమీద జెఱ్ఱులు పరిగెత్తాయి. "శివశివా" అంటూ చెవులు మూసుకుని "శంకరనామ పారాయణకు పక్కనే'నారాయణ' అనడానికి నీది నాలుకా తాటి పట్టా..." అంటూ తెల్లమొహం వేసి చూస్తూన్న తిమ్మయ్యమీదికి విరుచుకుపడ్డాడు.

తిమ్మయ్యగారికి ఇంక వీధి కనుక్కునే దారి కనపడలేదు. చీవాట్లతో బరువెక్కిన అతని తలకు కొంతసేపటికో ఉపాయం తోచింది. సంశయిస్తూనే తిమ్మయ్య, వీధిపేరు తనే అనడానికి బదులు, ఒక వీధిలో కెళ్లి "ఈ వీధి పేరేమిట"ని ఒకరిని అడిగాడు.

"వీధి పేరే తెలియనివాడివి ఇంక ఇల్లెలా కనుక్కుంటావయ్యా!" అని పదిమంది జవాబిస్తూ అతని వేపు అదోలా చూసేరు.

దానితో తిమ్మయ్య హతాశుడైపోయాడు కాని ఎలాగో తేరుకొని, ప్రతీ వీధిలోకి వెళ్ళి "ఇదే వీధి" అంటూ వాకబు చేస్తూనే ఉన్నాడు...చివర కెల్లాగో అలాగ ఆ వీధి పట్టుకున్నాడు!

★

డాక్టరు రోగితో: "ఏదీ, నోరు తెరిచి 'ఆ' అనండి."

రోగి: "నేను మందుకోసం రాలేదండి. బిల్లు చెల్లిద్దామని వచ్చానండి"

డక్టరు: "ఆఁ......"



రూ. 5 కు
మాత్రమే
మా కొత్త స్కీము
క్రింద 15 జ్యూయల్సు
చేతి గడియారము.
పోస్టేజి అదనంగా
రు. 1.

Swiss India Trading Co,
(P. M.) 42, Mohan Lal
Building, Gurmandi, Delhi-6

ప్రెసిడెంటు
వెజిటబుల్ హేర్ ఆయిల్,
స్నో, తాల్కమ్ పౌడర్
నా వాడుకకు శ్రేష్టమైనవని తెలిసికొంటిని.
తయారు చేయువారు:
మెసర్సు రథోడ్ ట్రేడింగు కంపెని
మద్రాసు - 1.



—సావిత్రి